# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## ప్రతిష్టాత్మక ప్రయోగానికి
# షార్‌లో కీలక పరీక్షలు

శ్రీహరికోట (తడ), జూన్ 24 ప్రభాతవార్త



శ్రీహరికోటలో తుదిపరీక్షల్లో చంద్రయాన్-3 ఉపగ్రహం

భారత ప్రతిష్టాత్మక ప్రయోగం చంద్రయాన్-3కి ఇస్రో శాస్త్రవేత్తలు తుది ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీహరికోటలోని రెండో లాంచ్‌ప్యాడ్ నుంచి వచ్చే నెలలో జరగనున్న చంద్రయాన్-3 ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో అన్ని ఏర్పాట్లు చేస్తోంది. షార్ అధికారులు క్షణం విరామం లేకుండా పనిచేస్తుంటే ఇస్రో శాస్త్రవేత్తలు షార్‌లోనే మకాం పెట్టారు. ఇప్పటికే ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ పలుమార్లు ఈ ప్రయోగ ఏర్పాట్లను పర్య వేక్షించారు. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంతరిక్ష పరిశోధన సంస్థలు ఇస్రో చేస్తున్న ఈ భారీ గగనయానాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. శ్రీహరికోట నుంచి ఇప్పటి దాకా అతిపెద్ద రాకెట్ జీఎస్ఎల్‌వి మార్క్3, ఎల్‌విఎం3లు అతి తక్కువ పరా జయాలను మాత్రమే ఎదుర్కొన్నాయి. దీనితో ప్రస్తుత ప్రయోగం కూడా సక్సెస్ సాధి స్తుందని నమ్ము తున్నారు. షార్‌లో చంద్రయాన్-3 ప్రయోగాన్ని గురిచూసి ఖచ్చితమైన లక్ష్యానికి పంపించాలని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

# ద్రౌపదీ దేవి ఊరేగింపు

శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీకృష్ణుడు, అర్జునుడు, ద్రౌపదీ దేవి విగ్రహాలను పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహాలను ఎంతో అందంగా అలంకరించి ఉత్సవాన్ని మద్రాసు రోడ్డు, జయ రామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధిలలో గ్రామోత్సవం సాగింది, ఉత్సవంతో పాటు చిన్న ఆలయాల ఇన్‌చార్జి వెంకటస్వామి, ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గాప్రసాద్‌లు పర్యవేక్షించారు.

# ఇద్దరు పిల్లల మృతికి బాధ్యులెవరు!

### ఇటీవల బదిలీపై వెళ్ళిన హెడ్మాస్టర్ - నామమాత్రంగా పాఠశాల తల్లిదండ్రుల కమిటీ



గుంతలో పడి మృతి చెందిన చిన్నారులు(ఫైల్‌ఫోటో)

చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త:

యాదమరి మండలం తెల్లరాళ్ళపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల క్రితం నాడు-నేడు పనుల కోసం త్రవ్విన ఓ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన విషాదకర సంఘటనకు బాధ్యులు ఎవరు అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి! పాఠశాల ఆవరణలో నాడు-నేడు పనుల్లో భాగంగా త్రవ్విన గుంతను సకాలంలో పూడ్చకపోవడంతో అటు వెళ్ళిన ఇద్దరు పిల్లలు ఆ గుంతలో పడి ప్రాణాలు వదిలారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పనులు చేపడుతుంది. ఈ పనులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టి పూర్తి చేయాల్సి వుంటుంది. అయితే తెల్లరాళ్ళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ పనులపై ఆసక్తి చూపకపోవడంతో గతంలో పాఠశాల హెడ్మాస్టర్‌గా విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడే చేపట్టినట్లు తెలుస్తోంది. ఆరు నెలల క్రితం త్రవ్విన ఈ గుంత పనులు త్వరితంగా చేపట్టి పూర్తి చేయకపోవడంతో కురిసిన వర్షాలకు ఈ గుంతలో నీరు నిండి ఆ నీట అటువైపు వెళ్ళిన ఆ నీటిలో మునిగి ఊపిరి ఆడకుండా ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. తెల్లరాళ్ళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం 74 మంది విద్యార్థులు వుండగా విద్యార్థులకు బోధించడానికి ముగ్గురు ఉపాధ్యాయులు వున్నారు. ఈ ముగ్గురు ఉపాధ్యాయుల్లో ఒక స్కూల్ అసిస్టెంట్ కాగా మరో ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో పాఠశాల హెడ్మాస్టర్ ఇక్కడి నుండి బదిలీ అయ్యారు. ఈ పాఠశాలకు నూతనంగా ఎవరిని హెడ్మాస్టర్‌గా నియమించలేదు. పాఠశాలలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఒక సెకండరీ గ్రేడ్ టీచర్ ఇన్‌ఛార్జీ హెడ్మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ నాడు-నేడు పనుల నిర్వహణపై ఆసక్తి చూపకపోవడంతో గతంలో విధులు నిర్వర్తించిన హెడ్మాస్టర్ పనులు చేపట్టాడు. ప్రస్తుతం మృతి చెందిన ఇద్దరు పిల్లలు పూర్తి(10), ఆమె సోదరుడు సతీష్(4)ల నివాసం పాఠశాల వెనుకవైపు వుంది. మృతి చెందిన పిల్లల ఇళ్ళ నుండి పాఠశాల మీదుగా రోడ్డుకు రావడానికి మార్గం సైతం లేదు. అయితే ఇటీవల పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను సులభంగా చేపట్టడానికి పాఠశాల ప్రహరి గోడను పడగొట్టి దారి చేసినట్లు తెలిసింది. అయితే ఈ దారి మూయకపోవడంతో చిన్నారులు రోడ్డుకు దగ్గరి దారి కావడంతో పాఠశాల వైపు నుండి వచ్చి త్రవ్విన నీటి గుంతలో పడి ప్రాణాలు విడిచారు.

పాఠశాలలో త్వరితంగా నాడు-నేడు పనులు చేపట్టి పూర్తి చేసి వుంటే ఈ దుర్ఘటన జరిగే అవకాశం వుండేది కాదు. పనులు ఆలస్యం కావడంతో త్రవ్విన గుంతను పూడ్చి పనులు చేపట్టే సమయంలో మళ్ళీ త్రవ్వుకొని వుంటే ఈ దుర్ఘటన జరిగి వుండేది కాదు. నాడు-నేడు పనులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చేపడితే ఈ పనులను స్థానిక హెడ్మాస్టర్, సిఆర్‌పి, ఎంఇఒలతో పాటు ఎస్ఎస్ఎ ఇంజనీర్ పర్యవేక్షించాల్సి వుంటుంది. ఇక్కడ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ పాత్ర ఏమి లేకపోవడం, స్వయంగా హెడ్మాస్టర్ పనులు చేపట్టడంతో ఇటు సిఆర్‌సి, ఎంఇఒ, ఎస్ఎస్ఎ ఇంజనీర్ సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో ఈ అనర్థం జరిగినట్లు స్పష్టం అవుతుంది. ఇంతకి ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ ఎవరిని బాధ్యులను చేస్తుందనే విషయంపై వేచి చూడాల్సి వుంది.

# పిల్లచిరుత బోనులో బందీ

### -భయంవీడిన భక్తులు
### -కొన్నిగంటల్లోపే ఉత్కంఠకు తెర



తిరుమల, జూన్ 24ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలకు వచ్చే అలిపిరి కాలినడకమార్గంలో గురువారం రాత్రి మూడేళ్ళ బాలుడు కౌశిక్‌ను నోటకరచుకుని ఆపై గాయపరిచిన పిల్లచిరుత ఎట్టకేలకు బోనులో బందీ అయ్యింది. శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ప్రత్యేక బోనులో రాత్రి 11గంటల ప్రాంతంలో దాడిచేసిన చిరుతపిల్ల పట్టుబడటంతో శనివారంఉదయం గుర్తించారు. చిరుత పట్టుబడటంతో భక్తులు భయంవీడారు. కాలినడకమార్గంలో 7వ మైలు సమీపంలోని అటవీప్రాంతం నుంచి వచ్చి బాలుడిపై దాడిచేసిన చిరుతను పట్టుకోవడానికి అఘామేగాలపై కొన్ని గంటల్లోపే రెండు బోన్లు ఏర్పాటు , కదలికలు గమనించేందుకు సిసి కెమెరాలు అమర్చి స్వయంగా టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి పర్యవేక్షణలో టిటిడి డిఎఫ్ఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చిరుతకోసం ప్రత్యేక నిఘా ఉంచారు. బాలుడిపై దాడిచేసిన అదేమార్గంలో మళ్ళీ రాత్రికి పిల్లచిరుత రావడంతో బోనులో జిక్కుకుంది. శనివారం ఉదయం బోనులో జిక్కుకున్న చిరుతను టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, అటవీశాఖ అధికారులు పరిశీలించారు. తల్లిచిరుత కోసం సెర్చింగ్ కొనసాగుతుందని అటవీవర్గాలు శనివారం మీడియాప్రతినిధులకు వెల్లడించారు. పిల్లచిరుత బందీకావడంతో భక్తులు కొంత ఊరటకలిగింది.

# కుప్పం అభివృద్ధిపై జగన్ ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర అటవీ,గనులశాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- త్వరలో హంద్రీ-నీవా పనులు పూర్తిచేసి నీరందిస్తాం !!
- ప్రజల ఇంటి ముగింటకే సంక్షేమపథకాల అమలుకు సచివాలయ వ్యవస్థ!!



వాలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుప్పం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర అటవీ,గనులు,విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లకు సేవావజ్ర,సేవారత్న, సేవామిత్ర అవార్డులు 29మందికి అందించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం ఏర్పాటయ్యాక కుప్పంను మున్సిపాలిటీగా చేసి అన్ని విధాలా అభివృద్ధికి సిఎం కృషి చేస్తున్నారన్నారు. అవసరమైన నిధులు కూడా విడుదల చేయడం జరుగుతోందన్నారు. గత ఏడాది కుప్పం పర్యటనలో భాగంగా సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేసి కుప్పానికి నీరందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఇళ్ల ముంగిటకే సంక్షేమ పథకాల అమలుకు సచివాలయ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిందన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాల్లో లబ్ధికి వాలంటీర్లు ప్రధాన భూమిక పోషించారన్నారు. ప్రభుత్వ సెలవుదినాలు, ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేది ఠంఛనుగా పింఛన్లు అందిస్తున్నారన్నారు. ఇలాంటి సేవలు అందిస్తున్న వాలంటీర్లను గౌరవించాలనే ఉద్దేశంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి వాలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా సత్కరించి నగదు ప్రోత్సాహకాలు అందించడం జరుగుతోందన్నారు. అనంతరం జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమంలో మున్సిపాలిటీకి మంజూరైన ఎనిమిది ఇ -ఆటోలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, డా॥ కంచర్ల శ్రీకాంత్, సిపాయి సుబ్రమణ్యం, మునిసిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, పికెఎం ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జానపదకళల అభివృద్ధి మండలి ఛైర్మన్ కొండవీటి నాగభూషణం , రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, కమీషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, ఎంపిపి అశ్విని, మెప్మాపిడి రాధమ్మ, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, రాష్ట్ర నేత మొగసాల కృష్ణమూర్తి, పిఎసిఎస్ ఛైర్మన్ తిమ్మోజిగౌడు, మాజీ ఛైర్మన్ పత్రాల మునిరత్నం,కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# జగనన్న సురక్షను విజయవంతం చేద్దాం

### - మంత్రి రోజా



నగరి, జూన్ 24 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరు సమిష్టిగా విజయవంతం చేయాలని మంత్రి రోజా పిలుపునిచ్చారు. నగరిలోని కల్యాణ మండపంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై పుత్తూరు మున్సిపాలిటీ, నగరి రూరల్, పుత్తూరు రూరల్, వడమాలపేట మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ప్రజాప్రతినిధులకు శనివారం జరిగిన అవగాహన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టిన జగనన్నసురక్ష కార్యక్రమం చాలా అద్భుతమైన కార్యక్రమం దీని మీద అందరూ ఒక బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎవరూ చేయనటువంటి విధంగా ధైర్యంగా ఎమ్మెల్యేలు, మంత్రులు మన ప్రభుత్వం ద్వారా ప్రతి గడపకు వెళ్లి తాను ఇచ్చిన వాగ్దానం ప్రకారం అందరికి అన్ని అందుతున్నాయా...లేదా.. ఒక వేళ అందకపోతే ఎందుకు అందడం లేదో తెలుసుకుని వాటిని అందజేయడానికి ప్రధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సమావేశంలో పుత్తూరు మున్సిపాలిటీ, నగరి రూరల్, పుత్తూరు రూరల్, వడమాలపేట మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు, కమిటీల ఛైర్మన్‌లు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# చంద్రబాబూ..పదివేల మంది వేరే.. సిఎం జగన్ వేరే

### మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం(గుడుపల్లె), జూన్ 24 ప్రభాతవార్త

ఇటీవల కుప్పం పర్యటనకు వచ్చిన ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు తాను సిఎం జగన్ లాంటి వారిని పదివేలమందిని చూశానని పేర్కొన్నారని అయితే పదివేలమంది వేరే, సిఎం జగన్ వేరే అని రాష్ట్ర అటవీ,గనులు,విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం గుడుపల్లెలో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తామేంటో 2024 ఎన్నికల్లో తెలుస్తుందని పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తే అద్భుతాలు, మేం చేస్తే కాదట అని పేర్కొన్నారు. సిఎం జగన్‌కు చంద్రబాబునాయుడుకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. 2014 ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు 600హామీలు, 100 పేజీల మేనిఫెస్టో ప్రకటించారన్నారు. ఇంటికో ఉద్యోగం, రైతులు, మహిళల రుణమాఫీ, నిరుద్యోగ భృతి హామీలు ఇచ్చారని వీటిలో ఎన్ని హామీలు అమలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. 2019 ఎన్నికలకు ముందు మహిళలు ఓట్లు వేస్తారని మహిళలకు పదివేల వంతున పసుపు-కుంకుమ పేరిట డబ్బులిచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. 2019నాటికి మహిళా సంఘాలకు 14వేల కోట్లు అప్పులు ఉండేవన్నారు. వాటిని వైఎస్సార్ ఆసరా పథకంలో ఇప్పటికే మూడు సార్లు సిఎం జగన్ నేరుగా మహిళల ఖాతాల్లోకే నగదు జమ చేశారన్నారు. రైతులకోసం గ్రామాల్లో ఆర్‌బికెలు ఏర్పాటుచేసి ఎరువులు, విత్తనాలు, పనిముట్లు అందిస్తున్నామన్నారు. మూడు వేల కోట్లతో రైతులకు ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేశామన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలలో 99.5శాతం హామీలను సిఎం జగన్ అమలు చేశారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం పదేళ్ల హైదరాబాద్ రాజధానిగా పాలన చేసే అవకాశం ఉన్నా ఓటుకు నోటు కేసుకు భయపడి చంద్రబాబు హైదరాబాదు నుంచి పారిపోయారని విమర్శించారు. సమావేశంలో చిత్తూరు ఎంపి రెడ్డెప్ప, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, సీనియర్ నేతలు ఎంఆర్‌సి రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, పికెఎం ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, పరిశీలకుడు రెడ్డెప్ప, ఎంపిపి వరలక్ష్మి గోపి, జడ్పీటిసి కృష్ణమూర్తి, కన్వీనర్ రామకృష్ణ, కో కన్వీనర్ రామూర్తి, యూత్ అధ్యక్షుడు రవి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు

### ఆగమోక్తంగా సాక్షాత్కార వైభవోత్సవాలు



చంద్రగిరి, జూన్ 24 ప్రభాతవార్త:

సర్వాంతర్యామియైన శ్రీనివాసుడు పెద్దశేషవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం నుండి మూడు రోజులు సాక్షాత్కార వైభవోత్సవాలు శనివారం ఆగమోక్తంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా స్వామి వారిని వైకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్య కైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాక్షాత్కార వైభవో త్సవాలను పురస్కరించుకుని ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులకు స్నపన తిరు మంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, గంధంతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సర్వాంతర్యామి అయిన శ్రీనివా సుడు పెద్దశేష వాహనంపై తిరు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్స్ టి.వెంకట స్వామి, నర్రా మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు, అర్చకులు శేషాచార్యులు, జమేధర్ మంకు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి లబ్దిదారుడికి సంక్షేమం అందాలి

### -అవిలాల పర్యటనలో కలెక్టర్



తిరుపతిరూరల్ జూన్24 ప్రభాతవార్త:

అర్హత కలిగిన ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు. రాష్ట్రంలో అర్హత ఉండి సంక్షేమ అందని లబ్దిదారులను గుర్తించి సంక్షేమ పథకాలు అందించుటకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఆయా పంచాయతీలలో లబ్దిదారులను గుర్తించుటకు గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు సర్వేలో పాల్గొంటారని తెలిపారు. శనివారం తిరుపతిరూరల్ అవిలాల గ్రామ పంచాయతీ పరిధిలోని శానప్పకాలనీలలో కలెక్టర్ పర్యటించి, సర్వేని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 11 రకాల సర్టిఫికేట్స్‌కు సర్వీసు చార్జీలు లేకుండా ఉచితంగా అందిస్తుందన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, జగనన్న అభిమానులు ప్రతి ఇంటికి వెళ్ళి లబ్దిదారుల అవసరాలను గుర్తించి, వారికి కావాల్సిన సర్టిఫికేట్స్‌కు పత్రాలు సిద్ధం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కుల, నివాస, బర్త్, డెత్, పెళ్లి, ముటేషన్, మ్యుటేషన్ కరెక్షన్, ఫ్యామిలీ నెంబర్స్ సర్టిఫికేట్స్, ఆధార్ లింక్, క్రాప్ కల్టివేషన్ సర్టిఫికేట్స్‌నుఅందజేయనున్నారని తెలిపారు. డిఎల్‌డిఓ సుశీలాదేవి, డిఎల్‌పిఓ రూపారాణి, ఎంపిడిఓ వెంకటనారాయణ, ఇవో పిఆర్డీ గిరీధర్‌రెడ్డి సర్పంచ్ చిందేలి వెంకటరమణ, పంచాయతీ కార్యధర్శి కె.కరుణశ్రీ, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీ ఎపుడు తెరిపిస్తారు ?

### మంత్రి రోజాకు భానుప్రకాశ్ సెల్ఫీ ఛాలెంజ్



పుత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త :

ఎన్నికలకు ముందు జగన్మోహనరెడ్డి పాదయాత్రలో ఆయనతో పాటు మంత్రి రోజా కూడా ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చి ఓట్లేయించుకు న్నారని, ఇప్పటికి నాలుగేళ్లు పూర్తయినా ఫ్యాక్టరీని తెరిపించలేదని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ తెలిపారు. శనివారం మూతపడిన ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి ఫ్యాక్టరీని ఎపుడు తెరిపిస్తారో చెప్పాలని మంత్రికి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఫ్యాక్టరీ రైతులకు చెల్లించాల్సిన బకాయిలను గతంలో ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబునాయుడుకు చెప్పి దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు రైతులకు ఇప్పించారని గుర్తు చేశారు. నష్టాల్లో కూరుకుపోయి మూతపడిన ఫ్యాక్టరీని తెరిపించేందుకు టిడిపి ప్రభుత్వం ప్రయత్నించిందని తెలిపారు. పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యాక్టరీని తెరిపిస్తామని జగన్ రెడ్డి రైతులకు హామీ ఇస్తే... దానిని నమ్మి రైతులు ఓట్లేసి మోసపోయారని తెలిపారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఫ్యాక్టరీ తెరవాలని అప్పట్లో రోజా ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేశారని, తర్వాత ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రి అయినా కూడా ఫ్యాక్టరీని ఎందుకు తెరిపించలేకపోయారని ప్రశ్నించారు. ఉద్యోగుల జీతాల బకాయిలకు ప్రభుత్వం అమలు కాని జిఒలు ఇచ్చి మభ్యపెడుతోందన్నారు. నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు, ఉద్యోగులకు ఫ్యాక్టరీ ఎపుడు తెరిపిస్తారో బహిరంగంగా చెప్పాలని డిమాండ్‌చేశారు. టిడిపి నాయకులు, రైతులు వున్నారు.

# అతిధుల సేవలో అధికారులు: సామాన్య భక్తుల తిప్పలు



శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు అతిధుల సేవలో తరించగా సామాన్యభక్తుల తిప్పలు వర్ణనీతంగా మారింది. రాహుకేతుదోష నివారణ పూజలు చేసుకున్న భక్తులకు క్యూలైన్లలో ప్రత్యక్ష నరకం కనబడింది. శనివారం అధికారులు అందించిన సమాచారం మేరకు 30వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. సుమారు 5వేల మంది రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. అభిషేకాలు 73కాగా శనీశ్వరాభిషేకాలు 68 జరిగాయి అలాగే ఏకాధశ రుద్రాభిషేకాలు 26 జరిగినట్లు సమాచారం అందించారు.

**అతిధుల సేవలో అధికారులు . . .**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం అతిధులు హాజరయ్యారు. వారి సేవలకు శాసనసభ్యుడు రెండుసార్లు, బిజెపి నాయకుడు మరోసారి వచ్చారు. దాంతో సామాన్య భక్తులకు తిప్పలు తప్పలేదు.సుమారు రెండు గంటల పాటు సామాన్య భక్తుల పరిస్థితి ఆయోమయంగా మారింది. శ్రీకా ళహస్తీశ్వరాలయంలో అతిధుల దర్శనాలకు ప్రత్యేక సమయంకేటాయించటానికి ఇటీవల జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం చేసారు. అయితే తాము చేసిన చట్టాలు, నిబంధనలను అమలు చేయలేకపోతే ఇక అదికారులు ఏం చేస్తారనే చర్చ చోటు చేసుకుంది. నిబంధనలు మాత్రం చూపరులను ఆకట్టుకునే రీతిలో ఉంటున్నాయి. ఇప్పటికైనా ఈ వాతావర ణంలో మార్పు రావాలి. వివిఐపిలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిందే కానీ సామాన్య భక్తులకు ఇబ్బంది కల్గించినంత కాదనే అభిప్రాయం వ్యక్త మౌతుంది.

## పరమహంస విద్యాలయలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

శాంతిపురం, జూన్ 24 ప్రభాతవార్త



స్థానిక పరమహంస యోగానంద విద్యాలయలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనత నిర్వహించారు. ఈసందర్భంగా తరగతులకు లీడర్లను ఎన్నుకుని బ్యాడ్జీలతో గౌరవించారు. జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ మాట్లాడుతూ లీడర్లుగా ఎన్నికైన వారు క్రమశిక్షణలో ఇతరులకు సాయం చేయడంలో ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షపై వాలంటీర్లకు శిక్షణ తరగతులు

శాంతిపురం, జూన్ 24 ప్రభాతవార్త



జగనన్న సురక్ష పథకంలో భాగంగా కెనమాకులపల్లి సచివాల యంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది శిక్షణ తరగతులు నిర్వహించారు. జగనన్న సురక్ష మండల స్పెషలాఫీసర్ రమ ణారెడ్డి మాట్లాడుతూ వాలంటీర్లు విధిగా వారికి కేటాయించిన కుటుంబాలకు ఈ పథకం ఆవశ్యకత తెలియజేసి క్షేత్రస్థాయిలో సమస్యలు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలన్నారు. కాగా శిక్షణ తరగతు లను జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. ప్రతి ఇంటిని వాలంటీర్లు జల్లెడ పట్టి సంక్షేమ పథకాలు ఇంకా ఎవరికైనా అందాలా సమస్యలు ఏమిటి అనే విషయం తెలుసుకోవాలని సూచించారు. ఎంపిడిఒ హేమమాలిని, సర్పంచ్ ఎవి జయరాం, ఆర్‌బికె అధికారి మనోజ్‌కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీ బోధనేతర సిబ్బంది నూతన కార్యవర్గం

కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త



ద్రవిడ వర్సిటీ తాత్కాలిక బోధనేతర సిబ్బంది నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా గణేష్, ఉపాధ్యక్షులుగా గంట రాజా, ప్రకాష్, జాయింట్ కార్యదర్శిగా వెంకటపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సుబ్రమణ్యం, కోశాధికారిగా త్యాగరాజు, టెక్నికల్ సూపర్ వైజరుగా హరిశంకర్, సుభాష్, మహిళా ప్రతినిధిగా విజయ, 24మంది సభ్యులను ఎన్నుకున్నారు. వర్సిటీలో బోధనేతర సిబ్బంది సమస్యల పరిష్కారంకు నూతన కార్యవర్గం కృషి చేస్తుందని వారు తెలిపారు.

## ఎస్సైపై కేసు నమోదుచేయాలి

-దళిత నేత మంజునాథ్

పెద్దపంజాణి జూన్24 ప్రభాతవార్త :



కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలం దళిత మహిళ మాజీ సర్పంచ్ మహదేవి మీద కులం పేరుతో దూషించి, ఎన్కౌంటర్ చేసి చంపుతా అన్న రామకుప్పం ఎస్సై కృష్ణయ్యపై కేసునమోదు చేయాలని మండల మాలమహానాడు అధ్యక్షులు మంజునాథ్ డిమాండ్ చేసారు. శనివారం మండల దళిత నేతలు తిప్పయ్య, ఆనంద్, తిరువలప్ప, శివప్ప, రెడ్డెప్ప లతో కలసి స్థానిక అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితమహిళా మాజీ సర్పంచ్‌కు న్యాయంజరిగేంతవరకూ దళితసంఘాలు మద్దతుగా నిలబడాలని, దళిత మహిళ మీద అనుచితవ్యాఖ్యలు చేసిన రామకుప్పం ఎస్సై క్రిష్ణయ్యపై ఉన్నతాధికారులు ఇంకా ఎందుకుచర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు ఇలాగే కొనసాగితే దళితసంఘాలు ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, చిన్న రెడ్డెప్ప, ఎల్లప్ప, వెంకటరమణ, అమర, వెంకటేషు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరమణ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి

పెద్దపంజాణి జూన్24 ప్రభాతవార్త :



మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి వ్యక్తిగత సలహాదారుడు వెంకటరమణ రెడ్డి భార్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని శనివారం ఆయన స్వగ్రామమైన మల్లసముద్రంలో పరామర్శించారు .ఈ నెల 22న గురువారం వెంకటరమణ రెడ్డి భార్య నాగమణి అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఈ మేరకు కొన్ని అనివార్య కారణాలతో అంత్యక్రియలకు హాజరుకాలేని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి శనివారం వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో చలపతి, రోజారెడ్డి, ఆనంద్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు పక్కాగా మధ్యాహ్న భోజనం

పాలసముద్రం, జూన్ 24 ప్రభాతవార్త:

పాఠశాల పిల్లలకు పక్కాగా మధ్యాహ్న బోజనం పెట్టాలని ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ ఆదేశించారు. ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ శనివారం వనదుర్గాపురం పంచాయతీ చలమరాజుఇండ్లు ఎంపిపి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కార్యక్రమంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచికరంగా చేసి పిల్లలకు వడ్డించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేవిధంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరేవిధంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఓఆర్డీ రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా సుందరీకరణ పనులు

– కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త:



చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని కూడళ్ళలోను సుందరీకరణ పనులను పక్కాగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగర పరిధిలో కొంగారెడ్డిపల్లి, కెల్విన్ స్కేల్ సర్కిల్ పరిసరాల్లో జరుగుతున్న సుందరీకరణ పనులను కమీషనర్ డాక్టర్ జె.అరుణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడళ్ళతో పాటు దుర్గానగర్ కాలనీ, తిమ్మారెడ్డి విగ్రహం సర్కిల్, వివేకానంద విగ్రహం, మురకంబట్టు, కట్టమంచి, దర్గా కూడళ్ళను సుందరీకరించే పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పచ్చదనం పెంపులో భాగంగా నిర్ధేశించిన ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమంను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇ వెంకటప్రసాద్, ఎఇ శ్రీలత తదితరులు పాల్గొన్నారు

## 60 అక్రమ మద్యం బాటిళ్ళు స్వాధీనం

పాలసముద్రం, జూన్ 24 ప్రభాతవార్త:

మండలంలోని కృష్ణజిమ్మాపురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో శనివారం ఓ ఇంటి నుండి పాలసముద్రం ఎస్ఐ సురేష్, సిబ్బంది 60 అక్రమ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకొని హరిబాబు అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ కృష్ణజిమ్మాపురం గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఇచ్చి హరిబాబు ఇంటిని తనిఖీ చేయడంతో 60 మద్యం బాటిళ్ళు పట్టుబడ్డాయన్నారు. ఈ మేరకు హరిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సురేష్ పేర్కొన్నారు.

## జడ్పీసిఇఒచే రూర్బన్ పనులు తనిఖీ

కుప్పం, జూన్ 24 ప్రభాతవార్త



కుప్పంమున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన, జరుగుతున్న నేషనల్ రూరల్ అర్బన్ మెషీన్ (రూర్బన్) పనులను శనివారం జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు స్థానిక మండల కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం సర్వే, అమలుకు ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జానకమ్మ, డిపిఆర్‌సి కోఆర్డినేటర్ షణ్ముగరామ్, ఇఒపిఆర్‌డి విజయ్‌దత్, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థిని చదువుకై ఆర్థికసాయం

కుప్పంరూరల్, జూన్ 24 ప్రభాతవార్త



చదువులో రాణిస్తున్న పేద విద్యార్థిని చదువుకై తెదేపా దళిత నేత కె.కన్నన్, సురేష్‌లు తమవంతుగా ఆర్థికసాయంను అందించారు. స్థానిక ప్రభుత్వ ఒకేషనల్ కాలేజ్‌లో ఫస్టియర్ కంప్యూటర్ సైన్స్ కోర్సు చదువుతున్నవిద్యార్థిని పూజకు అడ్మిషన్ ఫీజు నగదును వీరు తమ వంతుగాచెల్లించారు. కార్యక్రమంలోఅధ్యాపకుడుచంద్రశేఖర్‌పాల్గొన్నారు

## ట్రాక్టర్ల వేలంతో 4లక్షల ఆదాయం

శాంతిపురం, జూన్ 24 ప్రభాతవార్త



మండల పరిషత్‌కు చెందిన రికార్డులు లేని రెండు ట్రాక్టర్లను శనివారం బహిరంగవేలం వేయగా 4లక్షల ఆదాయం లభించింది. మొదటి ట్రాక్టర్‌ను జగదీష్ రూ 1,53,400లకు, రెండో ట్రాక్టర్‌ను వెంకటేష్ 3,57,540లకు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హేమమాలిని, తహశీల్దార్ నరసింహులు, జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దన్న, కో ఆప్షన్ నిసార్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రజలకు మంచి చేస్తున్న సిఎం జగనన్న మేలును గుర్తించాలి

– ఎమ్మెల్యే వెంకటేగౌడు.

పెద్దపంజాణి జూన్24 ప్రభాతవార్త :



ప్రజలకు వివిధ సంక్షేమపథకాల ద్వారా మంచిచేస్తున్న సిఎం జగనన్న మేలును ప్రజలు గుర్తించి మరో మారు ఆధరించాలని పలమనేరు ఎమ్మెల్యే డా॥ ఎన్. వెంకటేగౌడు కోరారు. శనివారం చలమంగళం మంచాయతీపరిధిలోనిచలమంగళం, సూలేరుగుట్ట, కె.ముద్దేపల్లి, వి.ముద్దేపల్లి, సి.ముద్దేపల్లి, పి.ముద్దేపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్మన్ జి.శ్రీనివాసులుతో కలిసి చలమంగళంలో సుమారు రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మితమైన నూతన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంను ప్రారంభించారు. అనంతరం 640 గృహాలను సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమపథకాలు అందుతున్నాయా!లేదా! అని పరిశీలించి ప్రజలకు వైకాపా ప్రభుత్వం ద్వారా కలిగినలబ్దిని వివరించి సంక్షేమపథకాల వివరాలతో కూడిన కరపత్రాలను లబ్దిదారులుకు నేరుగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎన్.రెడ్డెప్ప, జెడ్పీటిసి సుష్మాకీర్తి, పిఏసిఎస్ చైర్మన్ రెడ్డివారి ఓబుల్‌రెడ్డి(బాబు), మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపిపి జిడి.బాబు, మాజీ పిఏసిఎస్ చైర్మన్ శంకరప్ప, జెసిఎస్ కన్వీనర్ పృధ్వీ, నేతలు తమ్మిరెడ్డి, సన్నపరెడ్డి, రాజారెడ్డి, కృష్ణప్ప, లతీఫ్, ప్రసాద్‌రెడ్డి, ఎంపిటిసి మోహన్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యం రెడ్డి, పగడాల మురళి, రవికుమార్ మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

చౌడేపల్లి, జూన్ 24 ప్రభాతవార్త



రామకుప్పం ఎస్ఐ కృష్ణయ్యపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేసారు. శనివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామకుప్పం ఎస్ఐ కృష్ణయ్య అదే మండలానికి చెందిన మాజీ సర్పంచు మహాదేవి ఆమె భర్త జయశంకర్‌ను కులం పేరుతో దుర్భాషలాడటమే కాకుండా భయభ్రాంతులకు గురిచేయడం అప్రజాస్వామికమన్నారు. శాంతి భద్రతలు పరిరక్షించాలని రక్షభటులే ధౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కూరపర్తి ఈశ్వర్, మణి, ముకుందా, పరమేష్, సంతోష్, రాజు తదితరులు హాజరయ్యారు.

## బదిలీపై వెళుతున్న ఎంపీడీఓకు ఘనసన్మానం

ఐరాల, జూన్ 24 ప్రభాతవార్త:



ఐరాల ఎంపీడీఓగా పనిచేస్తూ నెల్లూరు జిల్లాకు బదిలీ అయిన నిర్మలాదేవిని శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఐరాల ఎంపీడీఓగా వున్న నిర్మలాదేవి నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈమేరకు బదిలీ అయిన ఆమెను ఎంపీపీ చింతం మోహన్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, మండలంలోని అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ నాగరాజు, తహశీల్దార్ సుశీల, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, వైకాపా నాయకులు సురేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డిలతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంలోకి వైకాపా నేత

పాలసముద్రం, జూన్ 24 ప్రభాతవార్త:



మండలంలోని వనదుర్గాపురం ఆది ఆంధ్రవాడకు చెందిన వైకాపా నేత ఆటో తులసీరామ్ శనివారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీటిసీ భీమినేని చిట్టిబాబు, మండల పార్టీ ప్రధాన క ఆర్యదర్శి శేఖర్‌రాజు ఆధ్వర్యంలో ఆటో తులసీరామ్ తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, నియోజకవర్గ యువత నాయకులు తంగరాజు, వాణిజ్య విభాగ కార్యదర్శి రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రామ్‌కుమార్‌రెడ్డి ఎన్నటికీ ఎమ్మెల్యేగా గెలవలేడు

– డాక్టర్ మస్తాన్‌యాదవ్

వెంకటగిరి, జూన్ 24, ప్రభాతవార్త:



ప్రజలను చులకనగా చూసే వైసీపీ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎన్నటికీ ఎమ్మెల్యేగా గెలవలేడని టీడీపీ నేత డాక్టర్ బొలిగల మస్తాన్‌యాదవ్ తెలిపారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతమైనందుకు వెంకటగిరిలోని మస్తాన్ యాదవ్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో ఆయన పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ నిర్వహిస్తున్న పాదయాత్ర సాయంకాలం నడకతో రామ్‌కుమార్‌రెడ్డి పోల్చడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రామ్‌కుమార్‌రెడ్డి ప్రజలను చూస్తూ అసహ్యించుకుంటున్నట్లు, ఇలాంటి వ్యక్తి ఎన్నటికీ ఎమ్మెల్యే కాలేడు అన్నారు. లోకేష్ పాదయాత్రకు అడుగడుగునా మహిళలు, యువత అందరూ నీరాజనం పలుకుతున్నట్లు చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గంలో లోకేష్ పాదయాత్ర విజయవంతంగా ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, చంద్రయ్య నాయుడు, తోట రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటా

– మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, జూన్ 24, ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. బాలాయపల్లికి చెందిన టీడీపీ నాయకుడు మాతృమూర్తి మృతి చెందడంతో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ భౌతిక కాయం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పార్టీ శ్రేణులకు ఎప్పుడు అండగా ఉంటానని తెలిపారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం, నాయకులు ఉన్నారు.

## తడలో ముగ్గురు వీఆర్ఓల బదిలీ

తడ, జూన్ 24 ప్రభాతవార్త

తడ మండలంలోని వివిధ చోట్ల పనిచేస్తున్న ముగ్గురు వీఆర్ఓలను బదిలీ చేసినట్లు శనివారం జిల్లా రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు తడ ప్రధాన గ్రామ వీఆర్ఓ ఎం.బాబు చిట్టమూరు మండలం మొలకలపూడికి, కాదలూరు వీఆర్ఓ రమణయ్య, తడ కండ్రిగ-1కు, తడకండ్రిగ-1 వీఆర్ఓ కె.రామకృష్ణయ్య సూళ్లూరుపేట మండలం కెసిఎన్‌గుంటకు బదిలీ అయ్యారు. ఈ మేరకు తక్షణం ఈ ముగ్గురు వీఆర్ఓలు తమకు కేటాయించిన చోట విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

## సచివాలయాల్లో ధ్రువపత్రాలు జారీ శిబిరాలు



కోట, జూన్ 24 ప్రభాతవార్త

జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాలను జూలై 1వ తేదీ నుంచి నెలాఖరు వరకు సచివాలయల్లోని ప్రత్యేక శిబిరాల్లో అందజేస్తారని డిఎల్‌పిఓ వెంకటరమణ చెప్పారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓతో కలిసి ఆయన విలేఖరులతో మాట్లాడారు. ఈ నెల 24 నుంచి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారధులు ఇంటింటికి వెళ్లి ఆయా అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఆదాయ, జనన, కుల, మరణ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్ పర్ ట్రాన్సాక్షన్, కొత్త రేషన్‌కార్డులు, విభజన కార్డులు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులో చరవాణి సంఖ్య అప్‌డేట్, కౌలు గుర్తింపుకార్డులు, వివాహ, కుటుంబ కార్డుల్లో సభ్యుల తొలగింపు వంటి ధ్రువపత్రాలు జారీ చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు ఎంపిడిఓ ఒక బృందంగా, తహశీల్దార్ మరో బృందంగా మండలంలో పర్యటిస్తారని డిఎల్‌పిఓ తెలిపారు.

## భూకబ్జాదారుల హవా

- పెరిగిపోతున్న ఆక్రమణలు
- నెలబల్లిలో ఇష్టారాజ్యంగా దుకాణాలు
- పట్టించుకోని ఆర్అండ్‌బి, రెవెన్యూ సిబ్బంది



దొరవారిసత్రం, జూన్ 24 ప్రభాతవార్త

భూకబ్జాదారుల హవా రోజురోజుకు మితిమీరిపోతోంది. జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలు, జాతీయ రహదారి స్థలాలపై భూకబ్జాదారుల కన్నుపడి ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నారు. రాత్రికి రాత్రే కబ్జా చేసిన ప్రభుత్వ భూముల్లో మట్టిని నింపి చదును చేసి లేఅవుట్లు వేస్తున్నా రెవెన్యూ అధికారులు, జాతీయ రహదారి అధికారులు మామూళ్ల మత్తులో పడి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో భూకబ్జాదారుల హవా రోజురోజుకీ పెరుగుతోంది. దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి వెంబడి ఉన్న సర్వే నంబర్ 19లో సుమారు 1 ఎకరా 75 సెంట్ల ప్రభుత్వ భూమిని కొందరు బడా నాయకులు స్వాధీనం చేసుకొని రాత్రికి రాత్రే మట్టిని నింపి దుకాణాల కోసం లేఅవుట్లు వేసేస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు. ఏకంగా పలువురు భూకబ్జాదారులు అధికార పార్టీ నాయకుల అండదండలతో రెవెన్యూ అధికారులను లోబర్చుకొని ఎలాంటి అనుమతులు లేకుండా జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ భూములను చదును చేసి ఆపై మట్టి నిం పి దుకా ణా లను ఏ ర్పా టు చేస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. నెలబల్లి సమీపంలో అటు తెలుగుగంగ కాలువ, ఇటు జాతీయ రహదారి పక్కన సుమారు ఐదు దుకాణాలు నిర్మిస్తున్నా ఏ అధికారి కూడా కన్నెత్తి చూడటం లేదు. దీంతో ఒకరిని చూసి మరొకరు రహదారి వెంబడి ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

## 27, 28 కోటలో లోకేష్ పర్యటన విజయవంతం చేయండి

కోట, జూన్ 24 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శనివారం మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన కోట మండలంలోకి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేరుకుంటుందని తెలిపారు. ఆ రోజు రాత్రి వెంకన్నపాలెం గ్రామం వద్ద కోట మండల తెలుగుదేశంపార్టీ నాయకులు ఘనస్వాగతం పలుకుతారని చెప్పారు. అక్కడి నుంచి లోకేష్ పాదయాత్ర కోట క్రాస్‌రోడ్డుకు సమీపంలోని హరిహర రైస్‌మిల్లు సమీపంలోని లేఅవుట్‌లో రాత్రికి బస చేస్తారని తెలిపారు. అనంతరం 28న ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వివిధ వర్గాలతో ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. 28న మధ్యాహ్నం 4 గంటలకు పాదయాత్రగా బయలుదేరి కోట గాంధీబొమ్మ సెంటర్లో బహిరంగ సభలో మాట్లాడతారని చెప్పారు. అనంతరం అక్కడి నుంచి కొక్కుపాడు, ఉత్తమనెల్లూరు, కర్లపూడి మీదుగా చిల్లకూరు మండలంలోకి వెళతారని తెలిపారు. నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## 26న కేంద్రమంత్రి పర్యటన విజయవంతం చేయండి

కోట, జూన్ 24 ప్రభాతవార్త

ఈ నెల 26న కేంద్ర ఐటీ సహాయమంత్రి సెహగ్ పర్యటన విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం పారిచర్లవారిపాలెం పర్యటన అనంతరం ఏ5 హోటల్‌లో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో, శక్తి కేంద్ర ప్రముఖులతో సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం వాకాడు మండలం తూపిలిపాలెంలోని సమాచార కేంద్రాన్ని తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

సూళ్లూరుపేట, జూన్ 24 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జడ్పీ బాలికల హైస్కూల్‌లో ఇటీవల 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పదిమంది విద్యార్థులకు ఈ బహుమతులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేసిన అధ్యాపకులకు, విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ధనలక్ష్మి, రఘురాం, వెంకటేశ్వర్లు, ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కోట ఎంఇఓ-1గా శైలజ నియామకం

కోట, జూన్ 24 ప్రభాతవార్త

కోట మండల విద్యాశాఖ అధికారి-1గా శనివారం శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఓజిలి మండలంలో ఎంఇఓగా పనిచేస్తూ కోట మండల ఎంఇఓ-1 ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య పథకాలను విద్యార్థులకు సక్రమంగా అందించేందుకు కృషి చేస్తామన్నారు.

## 30న కాణిపాకం ఆలయ హుండీల లెక్కింపు

కాణిపాకం, జూన్ 24 ప్రభాతవార్త

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 30 హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు జరిగే హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

## అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

-పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు

తవణంపల్లె, జూన్ 24 ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికి రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. శనివారం మండలంలోని పుణ్యసముద్రం గ్రామ సచివాలయ పరిధిలోని ద్వారకాపురం గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ శంకరయ్య, ఉపాధి ఏపీఓ లలిత, వెలుగు ఏపీఎం రవి, ఏఓ ప్రవీణ్, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ సిద్ధపల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, పుణ్యసముద్రం రవిప్రసాద్, డేవిడ్, కుమార్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేటినుంచి శ్రీ ప్రసన్న ఊరిగంగమాంబ జాతర

**కుప్పంరూరల్, జూన్ 24 ప్రభాతవార్త** కుప్పం మున్సిపాలిటీ డికెపల్లి ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీ ప్రసన్న ఊరి గంగమాంబ జాతర ఈనెల25-29 తేదీల్లో జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. 25న అంకురార్పణం, ధ్వజారోహణం, దీపారాధన, ఉత్సవం, 26న అన్నదానం, కళ్యాణోత్సవం, 27న రథోత్సవం, 28న అగ్నిగుండం, పుష్పపల్లకి, బాణవేడుకలు, 29న శయనోత్సవం, జూలై 2న పొంగళ్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## పాదయాత్రలలో లోకేష్ ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తారు

- మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 24, ప్రభాతవార్త: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రజలు చెప్పిన సమస్యలను తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. డక్కిలి మండలం ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను వైసీపీ ప్రభుత్వం ఆపివేసిందని టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రిజర్వాయర్ పనులను మొదలుపెడతామని తెలిపారు. ఇంకా అనేక సమస్యలను ప్రజలు



తెలిపారని, వాటిని పరిష్కరిస్తామన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి మాదిరి కాకుండా లోకేష్ ఇచ్చిన హామీలను పరిష్కరిస్తారని తెలిపారు. కాగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి లోకేష్ చేసిన పాదయాత్ర ఈవినింగ్ వాక్కు మాదిరి ఉందని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. లోకేష్ పాదయాత్రకు ప్రజల్లో అనూహ్య స్పందన వస్తుందని చెప్పారు. అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, నాయకులు గంగాధర్, చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూ.7కోట్ల విలువైన స్థలం ఆక్రమణకు యత్నం...అడ్డుకున్న గ్రామస్తులు

పుత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త : మునిసిపాలిటీ పరిధిలో కె.ఎం.అగ్రహారంలో వున్న తక్కరసు గుంటను ఆక్రమించేందుకు కొందరు చేసిన ప్రయత్నాలను గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈశ్వరాపురం రెవెన్యూ లెక్క దాఖలాలోని 230/1లో 2.24 ఎకరాల విస్తీర్ణంలో వున్న తక్కరసు గుంటలో జాతీయ రహదారి నిర్మాణంలో 49 సెంట్లు పోగా మిగిలిన 1.75 ఎకరాల గుంట స్థలం తమదంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. పదేళ్లుగా ఈ వివాదం నడుస్తూనే వుంది. ఈ నేపథ్యంలో శనివారం కొందరు ఈ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించగా స్థానికులు వారిపై తిరగబడి ఫెన్సింగ్‌ను లాగి పారేశారు.


ఫెన్సింగ్ తొలగిస్తున్న గ్రామస్తులు

సరిహద్దులు నిర్ణయిస్తూ వేసిన రాళ్లను తొలగించారు. ఈ భూమి వివాదానికి సంబంధించి 2022లో పుత్తూరు తహశీల్దారు హైకోర్టులో అఫిడవిట్ ప్రకారం వివరాలు ఇలా వున్నాయి. తక్కరసు గుంట భూమి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిందని పేర్కొంటూ 2009లో ఎ.కె.రంగభాష్యం అనే వ్యక్తి పట్టాదారు పాస్ పుస్తకాల కోసం రెవెన్యూ శాఖాధికా రులకు దరఖాస్తు చేసుకున్నారు. గుంట కావడంతో అధికారులు టైటిల్ డీడ్ ఇవ్వలేదు. దీనిపై 2010లో ఆయన హైకోర్టుకు వెళ్లగా రెవెన్యూ అధికారులు సరైన ఆధారాలు సమర్పించకపోవడం వల్ల టైటిల్ డీడ్ ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అప్పటి తహశీల్దారు సర్వే చేసి గుంట స్థలానికి టైటిల్ డీడ్ ఇవ్వలేమని నిరాకరించారు. దీనిపై రంగభాష్యం రెవెన్యూ శాఖాధికారులపై కోర్టు ధిక్కరణ కేసు వేయగా విధి లేక అధికారులు టైటిల్ డీడ్ మంజూరు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. అయితే అధికారులు ఇది గుంట స్థలమని పేర్కొంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో రంగభాష్యం కుమారుడు అజయ్ వివాదాస్పద భూమిని వడమాలపేట మండలం ఎస్‌బిఆర్ పురానికి చెందిన ఒక వ్యక్తికి జిపిఎ చేయడానికి ప్రయత్నించగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు నిరాకరించారు. దీనిపై అజయ్ హైకోర్టుకు వెళ్లగా ప్రస్తుతం కేసు నడుస్తోంది. కోర్టులో కేసు తేలకుండానే శనివారం ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించగా స్థానిక మూడు గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. మార్కెట్ ధర ప్రకారం ఈ స్థలం విలువ సుమారు ఏడు కోట్లు వుంటుందని అంచనా. టిడిపి చిత్తూరు బిసి సెల్ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి గ్రామస్తులతో సమావేశమై గుంట అన్యాక్రాంతం కాకుండా పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి




శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ మరియు పారిశుద్య వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మున్సిపల్ రంగంలో గల ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇచ్చిన హామీలైన సమాన పనికి సమానవేతనం ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మిట్ చేస్తానని ఇచ్చిన మాట నేటికి నేరవేర్చడం లేదని సమానపనికి సమానవేతనం ఇస్తామని తెలిపినా ఇప్పటి వరకు నెరవేర్చని కారణంగా తమ డిమాండ్లను వెంటనే పరిష్కరిం చాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. 2019లో ఇచ్చిన జివో నంబర్ 30 ప్రకారం 28 రకాల పనులు చేసే కార్మికులను గుర్తించి టైం స్కేల్ వర్తింపచేయాలని రాష్ట్ర కార్మికశాఖ వేతన సవరణ బోర్డును పునరుద్ధరించాలన్నారు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా సంక్షేమ పథకాలు అందజేయాలని అనే నినాదంతో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.మహేంద్రసింగ్, బలరామయ్య, రాము, సుబ్రమణ్యం, దేశయ్య, హరి, వెంకటేష్, మీర్జా, మొహిద్దీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌లోకి నిస్సాన్ మ్యాగ్‌నిట్ జాజ్ విడుదల




తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త : మ్యాగ్‌నిట్ ఇండియాలో ఆవిష్కరించినప్పటి నుండి ఇప్పటి వరకు లక్షకార్లు ఉత్పత్తి చేయడం జరిగిందని రేణిగుంట రోడ్డులోని నిస్సాన్ అధీకృత డీలర్లు అన్నారు. శనివారం నిస్సాన్ షోరూమ్ నందు కొత్త మ్యాగ్‌నిట్ జాజ్ కారును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కొత్త మ్యాగ్‌నిట్ జాజ్‌లో 360 డిగ్రీల కెమెరా, 9 ఇంచలు టచ్ స్క్రీన్, రేర్ ఎసి, వైర్‌లెస్ చార్జీ, మూన్‌లైట్ అప్పీరెన్స్ తదితర ప్రత్యకతలు కలిగివుందన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా భూమన్, శ్రీసిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి, హైటెక్ మోటార్స్ డైరెక్టర్లు హోషిమారెడ్డి, ఆశిష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి మరియు నిరంజన్, ఎన్.వి.ఎస్.శాస్త్రి పాల్గొన్నారు.

## రాజనాలబండపై సత్య ప్రమాణాల జోరు

రాజనాలబండ(చౌడేపల్లి), జూన్ 24 ప్రభాతవార్త : సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండపై శనివారం ప్రమాణాల జోరు కొనసాగింది. సొమ్ములు పోగొట్టుకొన్నవారు, అనుమానితులు వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చారు. కొందరు ప్రమాణాలు చేయగా, మరికొందరు వాయిదా వేసుకొని వెళ్ళారు. బండపై గల ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు.

## గణనాధుని సన్నిధిలో శ్రీశైలం ఆలయ ఛైర్మన్



కాణిపాకం, జూన్ 24 ప్రభాతవార్త: శ్రీశైలం శ్రీభ్రమరాంభిగా సమేత మల్లిఖార్జున స్వామివారి దేవస్థానం ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి శనివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ సూపరెంటెంట్‌లు రంగస్వామి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయానికి లడ్డు ట్రేలు విరాళం



తిరుచానూరు, జూన్ 24 ప్రభాతవార్త : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి శనివారం చెన్నైకు చెందిన వ్యాపారవేత్తలు దేవకర్, బాల, విద్యానాధన్‌లు 150 లడ్డు ట్రేలు విరాళంగా అంద జేసారు. రూ. 6 లక్షలకు పైగా విలువగల వీటిని ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, జమేదర్ ధనం జయ అందుకున్నారు. అనంతరం వారికి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేసారు.

## జగనన్న సురక్ష సర్వేని పరిశీలించిన కలెక్టర్



రామచంద్రాపురం, జూన్ 24 ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. శనివారం దేసూరు కండ్రిగ ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష సర్వేని పరిశీలించిన కలెక్టర్ వాలంటీర్ రోహిణీని అభినందించారు. ఈ క్రమంలోనే గ్రామస్థులు తమ గ్రామ సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళారు. స్కూల్ భవనం శిధిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నూతన భవన నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. గ్రామంలో ఎంత మంది పిల్లలు బడికి వెళుతున్నారని ఆరా తీశారు. అక్కడే వున్న చిన్నారులతో కొద్ది సమయం ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డిఎల్‌డిఓ సుశీలాదేవి, ఎంపిటిసి రాజేష్, కార్యదర్శి భువనేశ్వరీ, శశికుమార్ పాల్గొన్నారు.

## రైతులకు మెండైన సహకారం : మంత్రి రోజా



నగరి, జూన్ 24 ప్రభాతవార్త: ప్రస్తుత ప్రభుత్వంలో రైతులకు మెండైన సహకారం అందుతోందని మంత్రి రోజా అన్నారు. శనివారం తన నివాస కార్యాలయం వద్ద వైఎస్ఆర్ జలకళ లబ్ధిదారులైన రైతులకు రూ.13.60 లక్షల విలువచేసే విద్యుత్ మోటార్లు పరికరాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ జలకళ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పథకంలో మెట్ట భూముల్లో ఉచితంగా బోర్లు వేయడంతోపాటు ఉచితంగా మోటారు, పరికరాలు కూడా అందిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో జలకళ పథకంలో ఉచిత బోర్లు వేసుకున్న రైతులకు నగరి, గుండ్రాజుకుప్పం గ్రామానికిచెందిన కె.నాగరాజు, తెరణి గ్రామానికి చెందిన ఎస్.పి.పెరుమాళ్, వీఎన్ఆర్ పేట గ్రామానికి చెందిన జి.నిశాంత్, విజయపురం మండలం జగన్నాథపురంకు చెందిన ధనంజయలు, టి.దేశయ్య, విజయపురం గ్రామానికి చెందిన జి.మణిలకు విద్యుత్ మోటార్లు, ఇతర పరికరాలను అందించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ శోభన్‌బాబు, ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, వైస్ ఛైర్మన్ వెంకటరత్నంరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ మేదోమదన సదస్సు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 24 ప్రభాతవార్త : ఫౌండర్ ప్రెసిడెంట్ మురంశెట్టి రాములు టిటిడి బోర్డు సభ్యులు ఆధ్వర్యంలో తిరుపతి నందు ఐదు రాష్ట్రాలకు చెందిన రాష్ట్ర నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడమైంది. వ్యవస్థాపక అధ్యక్షులు మురంశెట్టి రాములు సప్త సూత్రాలతో ఉన్నటువంటి బ్రౌచర్ని శ్రీ రామానుజ చిత్రం హోరో సాయి వెంకట్‌తో కలిసి ఆవిష్కరించి సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ భవిష్యత్ కార్యాచరణను సమస్త యొక్క ముఖ్య నేపథ్యం రాజకీయ చైతన్యం, దేహరక్షణ, దేశ రక్షణ, ధర్మరక్షణ అమ్మ, ఆవు, అన్నం వంటి కార్యక్రమాల గురించి వివిధ రాష్ట్రాల నాయకులకు సభ్యులకు తెలియజేసారు. అదే విధంగా సెంట్రల్ కమిటీ, రాష్ట్ర నాయకులకు నియామక పత్రాలు అందజేసారు. వైశ్యులారా సంఘటిత శక్తిగా మారుదాం అంటూ ప్రసంగాన్ని మొదలు పెట్టిన రాములు ప్రతి వైశ్యుడు ఒక శక్తిగా మారాలంటూ దానికి గురువులు లాగా సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ ఉంటుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ జనరల్ సెక్రెటరీ బచ్చు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోతూరు శ్రీదేవి, సెంట్రల్ కమిటీ పిఆర్‌ఓ తేజ, ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర అధ్యక్షులు రాచపల్లి బాలాజీ, కార్యదర్శి పెద్దపల్లి వికాస్, కోశాధికారి పుట్ట శివకుమార్, కర్ణాటక శాఖ అధ్యక్షులు బిఎస్ గోవిందరాజు, కార్యదర్శి ఎంఎస్ సుబ్బలక్ష్మి, కోశాధికారి పీకే పద్మావతి, తమిళనాడు శాఖ అధ్యక్షులు నామ సతీష్ కుమార్, కార్యదర్శి అరవింద్, కోశాధికారి ఆర్‌విఎల్ రత్నకుమార్, మహారాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ ఎన్. కిరణ్ చిదరవర్, కార్యదర్శి సతీష్ పాండురంగన్ వాటంవార్ తెలంగాణ శాఖ కోశాధికారి మురళీకృష్ణ, రాష్ట్రాల ఉపాధ్యక్షులు, పీఆర్వోలు సభ్యులు పాల్గొన్నారు.

# 49వ లలితా జ్యువెల్లరీ షోరూం.. గూడూరులో ఘనంగా ప్రారంభం

గూడూరు, జూన్ 24 ప్రభాతవార్త : డబ్బులు ఎవరికి ఊరికే రావు ఇది వినగానే అందరికి గుర్తోచ్చే వ్యక్తి లలిత జ్యువెలర్స్ అధినేత కిరణ్ కుమార్ శనివారం గూడూరు పట్టణంలోని హాస్పిటల్ రోడ్లలో నూతన షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిధులుగా గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు, స్వచ్ఛంద కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ, లలిత జ్యూవెలరీ అధినేత ఎం. కిరణ్ కుమార్, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, లలిత జ్యూవలరీ 49వ షోరూంను శనివారం గూడూరు పట్టణంలోని హాస్పిటల్ రోడ్డులో నూతన షోరూమ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బంగారు వెండి వస్తువులను తిలకించారు. ఎమ్మెల్యే, ముఖ్య అతిధులను, లలిత జ్యూవెలరీ అధినేత కిరణ్ కుమార్ కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. పట్టణ ప్రజలు షోరూంకు విచ్చేసి బంగారు వెండి నగలను కొనుగోలు చేశారు. ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ నాణ్యత గల బంగారు ఆభరణాలు అతి తక్కువ ధరకే అందిస్తూ లలిత జ్యువలరీ గుర్తింపు పొందిందని అన్నారు. నేడు గూడూరు పట్టణంలో లలిత షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమని వీరి వ్యాపారం ఎంతో అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని శుభాకాంక్షలు తెలియజేసారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ దేవసేనమ్మ మాట్లాడుతూ స్వచ్ఛమైన బంగారాన్ని అందించాలని తలంపుతో లలిత జ్యువెలరీ పలు పట్టణాలలో షోరూములు ఏర్పాటు చేసిందని అన్నారు. లలిత జ్యువెలరీ అధినేత కిరణ్ కుమార్ మాట్లాడుతూ 38 సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా గుర్తింపు తెచ్చుకున్న లలితా జ్యువెలరీ ఇప్పుడు తన 49వ షోరూం గూడూరు పట్టణంలో ప్రారంభమైందని తయారీ ధరకే బంగారం, వజ్రాభరణాలను అందించేందుకు సిద్ధమైందని తద్వారా ప్రజలు పెద్దమొత్తంలో తమ కష్టార్జితాన్ని ఆదా చేయొచ్చని లలితా జ్యువెలరీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కిరణ్‌కుమార్ వెల్లడించారు. అంతేకాదు ప్రారంభోత్సవం సందర్భంగా మార్కెట్‌లోనే ఇతర షోరూంలలో లభించని సరికొత్త బంగారు నగల కొనుగోలు పథకంను కూడా అందిస్తోందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా ఈ నెల 24 నుంచి జూలై 9 వరకు గోల్డ్ కొనుగోలు చేసిన వారికి వేస్టేజ్‌లో 1 శాతం డైమండ్ మీద 4,000 రూపాయిలు తగ్గింపు ఉంటుందని ఛైర్మన్, మేనేజరింగ్ డైరెక్టర్ కిరణ్ కుమార్ తెలియజేసారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, పట్టణ ప్రముఖులు మహిళలు పాల్గొన్నారు.


లలితా జ్యువెలరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్ రావు

# సూళ్లూరుపేటలో శ్రీలలితా జ్యుయలరీ ప్రారంభం

సూళ్లూరుపేట, జూన్ 24 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలో నూతనంగా శ్రీ లలితా జ్యుయలరీని శనివారం స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజీవయ్య మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రాంత ప్రజలు ఇకపై బంగారు, వెండి నగలు కొనుగోలు చేసేందుకు చెన్నై, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం లేదని, నాణ్యమైన బంగారు నగలు లలితా జ్యుయలరీలో అందించేందుకు మంచి షోరూం ప్రారంభించారని చెప్పారు. లలితా జ్యుయలరీ ఎండి డాక్టర్ ఎం.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డబ్బులు ఎవరికీ ఊరికే రావని, నాణ్యమైన నగలను వినియోగదారులకు అందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. వారం పదిరోజుల పాటు తమ లాభాల్లో నుంచి ఒక్క శాతం తమ సంస్థలో కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక ఆఫర్ కింద అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. సూళ్లూరుపేటలో 48వ షోరూం, గూడూరులో 49, నెల్లూరులో 50వ షోరూం శనివారం రోజు ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్లు చిన్ని సత్యనారాయణ, పోలూరు పద్మ, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, పముజుల విజయలక్ష్మి, సౌజన్య, ఈదూరు చెంగమ్మ, జెట్టి వేణుయాదవ్, గోగులతిరుపాల్, తుపాకుల ప్రసాద్, కాకి శ్రీరామమూర్తిలు పాల్గొన్నారు.


లలితా జ్యువెలరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

## ఎక్కడ నివాసం వుంటే అక్కడే ఓటరుగా నమోదు

**- జిల్లాలో 15,40,453 మంది ఓటర్లు, 1,737 పోలింగ్ కేంద్రాలు- జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్**



చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త: నివాసం ఎక్కడ వుంటే అక్కడే ఓటరుగా వుండాలని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శనివారం జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం 91.87 శాతం పూర్తి అయ్యిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 15,40,453 మంది ఓటర్లు వున్నారని, వీరి కోసం 1,737 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే జిల్లాలో 14,15,218 ఓటరు కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడానికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. అలాగే గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలు పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాలో ఓటర్ల సంఖ్యను పెంచడంతో పాటు నకిలీ ఓట్లను తొలగించడం జరుగుతుందన్నారు. మృతి చెందిన, మార్పు చేయబడిన ఓటర్లు పునర్విమర్శ వ్యవధిలో బిఎల్ఎలు, బిఎల్ఓలతో సమన్వయం చేసుకొని పని చేయాల న్నారు. క్లైములు, అభ్యంతరాలు దాఖలు చేసే మొత్తం వ్యవధిలో బిఎల్ఓలు 30 కంటే ఎక్కువ దర ఖాస్తులు, ఫామ్‌లను క్లైమ్ చేస్తే క్రాస్ వెరిఫికేషన్‌ను ఈఆర్‌ఓలు, ఎఆర్‌ఓలు చేయడం జరుగుతుం దన్నారు. జూన్ 1 నుండి జులై 20వ తేదీ వరకు దరఖాస్తులపై ఈఆర్‌ఓలు, ఎఆర్‌ఓలు, ఇఆర్‌లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జులై 21 నుండి ఆగస్టు 21 వరకు బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఆగస్టు 22 నుండి సెప్టెంబర్ 29వ తేదీ వరకు పోలింగ్ స్టేషన్ల హేతుబద్దీకరణ, పునర్ వ్యవస్థీకరణలు, ఎలక్ట్రోరల్‌లో వ్యత్యాసాల తొలగింపు జరుగుతు ందన్నారు. అలాగే సెప్టెంబర్ 30 నుండి అక్టోబర్ 16 వరకు ఫార్మాట్-1 నుండి 8 వరకు సప్లిమెంట్ల తయారీ, ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్‌తో 1 జనవరి 2024 నాటికి నాణ్యత కల్గిన ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి ఉదయ్‌కుమార్, తెలుగుదేశం జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా సిపిఐ కార్యదర్శి నాగరాజు, సిపిఎం నాయకులు గంగరాజు, కాంగ్రెస్ నాయకులు పరదేశి, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సిబ్బంది ఉమాపతి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజశేఖర్‌రెడ్డికి పాల ఏకరి కులస్తులు జీవితకాలం రుణపడి వుంటాం

**- రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్‌రాజా**



బంగారుపాళ్యం, జూన్ 24 ప్రభాతవార్త: దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి పాల ఏకిరి కులస్తులు జీవితకాలం రుణపడి వుంటామని రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎంబి కుమార్‌రాజా అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో నూతనంగా ఏర్పాటైన పాల ఏకిరి కార్పొరేషన్ పాలకవర్గ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ నిరుపేదలైన పాల ఏకిరి కులస్తులను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బిసి జాబితాలో చేర్చారన్నారు. బీసీల్లో చేరడం వల్ల పలువురు పాల ఏకిరి కులస్తులు విద్య, ఉద్యోగాలు, రాజకీయంగా బల పడ్డారని గుర్తు చేశారు. పాల ఏకిరి కుస్తులను బిసి జాబితాలో చేర్చడానికి పలువురు ఎంతో కృషి చేశారని కొనియాడారు. వైఎస్ తనయుడు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల ఏకిరి కులస్తులను ప్రత్యేకంగా గుర్తించి వారి అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. అనంతరం నూతనంగా ఏర్పడిన పాల ఏకిరి పాలకవర్గంను ఆ కులస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు రఘుపతి(చంద్రగిరి), కిరణ్మయి(మదనపల్లి), లడ్డు రమణ (పుంగనూరు), సభాపతి(పులివెందుల), పరంధామ(సింగనమల), అరుణ కుమారి (రాజంపేట), రెడ్డప్ప(తిరుపతి), చలపతి(ధర్మవరం), శ్రీలక్ష్మి (రాయ చోటి), కుళ్ళయమ్మ(పుట్టపర్తి), నిర్మల(పులివెందుల) ను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాల ఏకిరి సంఘ అధ్యక్షుడు మురళీ, అనంత పురం, కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన పాల ఏకిరి నాయకులు రాజా, కుమార్, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, జొన్న సుబ్బయ్య, మల్లికార్జున, నాగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ నారే సోమశేఖర్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, నాయకులు సురేంద్ర, మహేంద్ర, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి హైకోర్టు జడ్జి ఇరకం దీవి పరిశీలన

**- భీములవారిపాలెం నుంచి పడవపై వెళ్లిన న్యాయమూర్తులు, ఇతర అధికారుల బృందం**



తడ, జూన్ 24 ప్రభాతవార్త : అమరావతి హైకోర్టు జడ్జి వి.సుజాత తిరుపతి జిల్లా తడ మండలం ఇరకం దీవిని శనివారం సందర్శించారు. ఆమె మండలంలోని భీములవారిపాలెం పడవ రేవు నుంచి ప్రత్యేక పడవపై చుట్టూ ఉప్పు నీళ్లతో నిండిన పులికాట్ సరస్సు మధ్యలోని ఇరకం దీవిని సందర్శించారు. ఇటీవల ఆ గ్రామంలో పెద్దఎత్తున శ్రీపొన్నియమ్మ ఆలయానికి ఘనంగా రథోత్సవం నిర్వహించారు. ఆ ఆలయాన్ని హైకోర్టు జడ్జి సందర్శించారు. ఇరకం గ్రామస్థులు వీరికి ఘనస్వాగతం పలికారు. అంతకు ముందు భీములవారిపాలెం వద్ద జిల్లా, మండల స్థాయి అధికారులు కూడా హైకోర్టు జడ్జి బృందానికి సాదర స్వాగతం పలికారు. హైకోర్టు జడ్జితో పాటు ఏసీబీ-2 డిఎస్పీ జయలక్ష్మి, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, సూళ్లూరుపేట సివిల్ కోర్టు న్యాయవాదులు ఎస్.అనిల్‌కుమార్, ఎస్.అనూష, వన్యప్రాణి సంరక్షణ శాఖ డిఎఫ్‌ఓ శామ్యూల్, సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి, స్థానిక తహశీల్దార్ జయజయరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆమె మళ్లీ పడవపై భీములవారిపాలెం చేరుకొని నెల్లూరు వైపు తరలి వెళ్లారు.

## శ్రీచెంగాళమ్మ సేవలో హైకోర్టు జడ్జి



సూళ్లూరుపేట, జూన్ 24 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని రాష్ట్ర హైకోర్టు జడ్జి వి.సుజాత శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఎసిబి-2 జడ్జి జయలక్ష్మి, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, న్యాయమూర్తి ఎస్.అనిల్‌కుమార్, ఎస్.అనూష, తహశీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు విభూది పట్టీలు కన్నులు విరాళం



చౌడేపల్లి, జూన్ 24 ప్రభాతవార్త : స్థానిక మృత్యుంజయేశ్వరస్వామికి దాత బంగారం విభూది పట్టీలు, కన్నులు విరాళంగా అందించారు. శనివారం ఆలయంలో గ్రూఫ్ టెంపుల్స్ ఇఓ కమలాకర్‌కు దాత తిరుపతికి చెందిన కడియాల మునెమ్మ రూ. 1.15లక్షల విలువ చేయు 20గ్రాముల విభూది పట్టీలు, కన్నుల నందించారు. అర్చకుడు మహేష్‌దీక్షితులు, ఎండోమెంట్ సిబ్బంది హరి, రమణ, స్థానికులు పాల్గొన్నారు.

## జిల్లా క్షయ నివారణ అధికారిగా డాక్టర్ వెంకటప్రసాద్

చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త: జిల్లా క్షయ నివారణ అధికారిగా శనివారం డాక్టర్ వెంకటప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ జిల్లా క్షయ నివారణ అధికారిగా విధులు నిర్వర్తించిన డాక్టర్ వెంకటప్రసాద్‌ను జిల్లాల పునర్విభజనకు ముందు నెల్లూరు జిల్లా క్షయ నివారణ అధికారిగా బదిలీ చేసింది. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో డాక్టర్ వెంకటప్రసాద్ చిత్తూరు జిల్లా క్షయ నివారణ అధికారిగా బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా క్షయ నివారణ అధికారి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.

## డిఎంహెచ్‌ఓగా డాక్టర్ ప్రభావతిదేవి



చిత్తూరు, జూన్ 24 ప్రభాతవార్త: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ ప్రభావతి దేవి నియమితులయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రకాశం సెలవుపై వెళ్ళడంతో ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఓగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ప్రస్తుతం కొనసాగుతున్నారు. ఈ క్రమంలో నంద్యాల జిల్లాలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రభావతిదేవిని చిత్తూరు జిల్లా ఫుల్ అడిషన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆమె డిఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వహించిన డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశంను విజయవాడ ప్యామిలీ వెల్ఫేర్ కమీషనర్ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.